క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న గుణిశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన బోనెల శివసత్యకుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10వేలు నగదు మంగళవారం వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఆయన మాట్లాడుతూ బీమా కింద రూ.లక్ష మంజూరైందని తెలిపారు. తక్షణ సాయంగా రూ.10వేలు అందించామని మిగిలిన సొమ్ము కుటుంబ సభ్యుల ఖాతాలోకి జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అప్పలస్వామి నాయుడు, టి .రమేష్, ఆర్‌పీ కృష్ణ వేణి, సచివాలయ అడ్మిన్ మోహిణి, వెల్ఫేర్ కార్యదర్శి రాము పాల్గొన్నారు.

రేష్మాయాదవ్‌కు అభినందన

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవవీధికి చెందిన రేష్మాయాదవ్ పూణేలో జరిగిన జాతీయ స్థాయి ఎల్‌బో బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. దీంతో ఆమెను మంగళవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు.ఆమె ఇలాంటి పతకాలు మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రేష్మా తండ్రి వాకాడ సన్నియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాద వితరణ



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆడారి శ్రీను, సాయిలత

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం దుర్గానగర్‌లో మంగళవారం నిర్వహించిన దుర్గమాంబ జాతర మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయంతో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. 56వ వార్డు మహిళా నాయకురాలు సర్వసిద్ధి సాయిలత నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనువాసరావు, 52,56,57 వార్డుల సచివాలయాల కన్వీనర్ పల్లా ఎర్నికుమార్ యాదవ్ ప్రసాద వితరణ చేశారు. భక్తులకు దుర్గమ్మ చిత్రపటాన్ని, గాజులు, పసుపుకుంకుమ, పులిహోర, చక్రపొంగలి, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయిలత, యలమించిలి రాజు పాల్గొన్నారు.

రెండు రైళ్లు ఆలస్యం

తాటిచెట్లపాలెం: షాలిమార్‌లో మే 9న మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమార్ – చెన్నై (12841) కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.20గంటలకు బయల్దేరింది. 9న చెన్నై సెంట్రల్‌లో రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 7.15కు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ – హౌరా(12840) మెయిల్ మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 10.05గంటలకు బయల్దేరుతుంది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు ఇవి చేరుకోనున్నాయి. ఈ రెండు రైళ్లు ఆలస్యంగా చేరుకున్న కారణంగా ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

135 మందికి ఉచిత కంటి వైద్యసేవలు

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం సత్యసాయి భజనమండలి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సంయుక్తంగా సత్యసాయి మందిరంలో నిర్వహించిన శిబిరంలో 135 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరం అవుతాయని ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు.

టీడీపీ హయాంలో ఇన్ని పథకాలు ఇచ్చారా...!

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 61, 62వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాల బ్రోచర్ లబ్ధిదారులకు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



సంక్షేమ ఫలాలు అందుకున్న వారితో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: ఒక్కసారి ఆలోచించండి.. గత టీడీపీ ప్రభుత్వానికి.. ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనకు తేడాను గమనించి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీ సచివాలయం పరిధిలో మంగళవారం కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం 600 పైగా హామీలు ఇచ్చి అవి గాలికి వదిలేసిందని గుర్తు చేశారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. పేద ప్రజలకు మంచి జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యమన్నారు.అర్హులైన ప్రతి పేదవాని గడపను సంక్షేమ పథకం తడుతుందని చెప్పారు. టీడీపీ నాయకులు చెప్పిన తప్పుడు మాటలు వినవద్దని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బద్రీనాథ్, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు చైర్మన్ ఆల్ఫా కృష్ణ,నాయకులు దాడి సత్యనారాయణ,పిలక రామ్మోహన్‌రెడ్డి,కేబుల్ వాసు,మూగి సూర్యనారాయణ,బూస అప్పలరెడ్డి,ఎస్.వి.రమణ యాదవ్,సోనూ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉజ్వల భవిత సీఎం జగన్‌తోనే..

సింధియా: రాష్ట్రంలోని పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఆడారి ఆనంద్‌కుమార్ నాయకులతో కలిసి 250 గడపలను సందర్శించారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ ఫలాలు అందించి స్వరాజ్య స్థాపన దిశగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు సీఎం జగన్ పెద్దపీట

సింధియా: మహిళలకు అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో డ్వాక్రా మహిళలతో మంగళవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం ఏ విధమైన సహకారం అందించిందో వివరించారు. కార్యక్రమంలో భీశెట్టి గణేష్, నక్కా సూర్యనారాయణ, భారతి, మసేనమ్మ, చింతా ప్రభాకర్, పీలా మాధవి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గోపాలపట్నం: ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం లక్ష్యమని తహసీల్దార్ జయ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇక్కడి అధికారులు తహసీల్దార్ కార్యాలయం నుంచి హాజరయ్యారు.

1902 నంబర్‌కు ఫోన్ చేస్తే నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్తుందని తెలిపారు. ఇలా ఫోన్ చేయడం వల్ల సర్వీస్ రిజిస్టర్ అయి సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ వస్తుందని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ప్రతీ దశను మీకు తెలియజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ ఏసీపీ అన్నెపు నరసింహ మూర్తి, సీఐలు ఈదుల నర్సింహరావు, బీఎండీ ప్రసాదరావు, విజయ్ కుమార్, కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, జోనల్‌కమిషర్లు మల్లయ్య నాయుడు, కృష్ణ, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆడారి ఆనంద్ కుమార్
- నాయీ బ్రాహ్మణులతో ఆత్మీయ సమావేశం



నాయీ బ్రహ్మణులకు బ్యాగులు అందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్ తదితరులు

గోపాలపట్నం: నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం సభ్యులతో గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు, వలంటీర్ వ్యవస్థపై విమర్శలు చేసిన చంద్రబాబు ఇప్పుడు వాటిని కొనసాగిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు బ్యాగులు అందించారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు ఎస్‌ఏ రెహ్మాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, కలిదిండి బద్రీనాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, నాయీబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధపట్టం యానాదయ్య, ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆరిపాక పెంటారావు, కార్పొరేషన్ డైరెక్టర్ వెంపడాపు నూకరాజు, నగర అధ్యక్షుడు అవత సుబ్బారావు, అప్పలరాజు, కార్పొరేటర్లు ముర్రువాని, పీవీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాకి శ్యామ్ కుమార్ రెడ్డి, అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, ఆడారి శ్రీనివాసరావు, చుక్క ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కొత్తమ్మ ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవంలో మహిళల కోలాటం

అల్లిపురం: అమ్మవారివీధి ప్రజల ఆరాధ్య దైవం, గ్రామదేవత కొత్తమ్మవారి నెల రోజుల పండగ మంగళవారం ఘనంగా ప్రారంభమయింది. ఈ సందర్భంగా కొత్తమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. సాయంత్రం మొదటి మంగళవారం భూలోకమాత అమ్మవారి పండగ వైభవంగా చేపట్టారు. తొలుత అమ్మవారి వీధిలో గల పెద్దింటి నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, మహిళల కోలాటం, బిందుల నృత్యాల మధ్య అమ్మవారి తిరువీధి ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని కాగడాల వెలుగులో అమ్మవారివీధి, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ల మీదుగా గోకుల్ థియేటర్ ఊరేగించారు. అక్కడ భూలోకమాత అమ్మవారికి పూజలు నిర్వహించి పండగ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో నీలాపు రమణారెడ్డి, నీలాపు విజయానందరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాల శ్రీహరిరెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మీ అమ్మాయిలను కాపాడుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు

డాబాగార్డెన్స్: ది కేరళ స్టోరీ సినిమా చూసి, మీ అమ్మాయిలను లవ్ జిహాద్ బారి నుంచి కాపాడుకోవాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు పిలుపునిచ్చారు. కేరళలో ప్రేమ పేరిట వేలాది మంది హిందూ, క్రిస్టియన్ అమ్మాయిలను పథకం ప్రకారం ముస్లింలుగా మత మార్పిడి చేస్తున్నారని అన్నారు. వివాహం చేసుకుని ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న ఐసిస్ ఉగ్రవాద శిక్షణ స్థావరాలకు తరలిస్తున్నారని అన్నారు. అక్కడ లైంగిక కోరికలు తీర్చే బానిసలుగా దుర్భర జీవితంలోని యువతులను నెట్టేస్తున్నారని తెలిపారు. ది కేరళ స్టోరీ సినిమా ద్వారా ఇదంతా అవగతం అవుతుందన్నారు. ఈ సినిమా కేవలం కలెక్షన్ల కోసమో, హిందూ, ముస్లిం సమస్యగానో భావించవద్దని, మానవత్వానికి–ఉగ్రవాదానికి మధ్య జరుగుతున్న వాస్తవ ప్రయత్నంగానే భావించాలని తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

11న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 11న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజారుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్ల వితరణ



బీపీ ఆపరేటర్లు అందజేస్తున్న సింహాద్రి టీఎంటీ, హిమా హ్యూమానిటేరియన్ సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: సింహాద్రి టీఎంటీ, హిమ హ్యూమానిటేరియన్ సంస్థ కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్లను సమకూర్చాయి. వాటిని హిమ హ్యూమానిటేరియన్ చైర్మన్ బీఎస్ మూర్తి, సింహాద్రి టీఎంటీ డైరెక్టర్ వి.వి.కృష్ణారావు కేజీహెచ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఏఆర్ఎంవో డాక్టర్ అరుణదేవికి అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ 32 ఏళ్లుగా హిమ హ్యూమానిటేరియన్, సింహాద్రి టీఎంటీ కేజీహెచ్‌కు అందజేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. మరెన్నో సేవా కార్యక్రమాలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పైల సన్నిబాబు, ఏఆర్ఎంవో డాక్టర్ అరుణదేవి, డాక్టర్ జగదీష్, మీసాల రామకృష్ణ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సులోచన, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, పల్లా ఆనంద్, కేవీ వేంకటేశ్వరరావు, హిమ హ్యూమానిటేరియన్ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాకేష్ నాయక్

కూర్మన్నపాలెం : భారతదేశంలోని ప్రజలందరు సమానత్వాన్ని పాటించడం, వివక్షను నిర్మూలించడమే మానవ హక్కుల నేర నిరోధక సంఘం ముఖ్య లక్ష్యమని సంఘ చైర్మన్ రాకేష్ నాయక్ అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 86వ వార్డు పరిధి దువ్వాడ సెక్టార్–2లో మంగళవారం రాజ్యాంగ రక్షణ–ప్రజాస్వామ్య పరిరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుల, మత, వర్ణ వర్గాలకు అతీతంగా సమానత్వం కోసమే ఈ సంస్థ పని చేస్తుందన్నారు. అవినీతి లేని సమాజం రావాలంటే ప్రజలు గొంతు విప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో డబ్బుకు ప్రలోభ పడకుండా నిజాయితీగా ఉండే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇందుకూరి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టుతో ఉజ్వల భవిత



విద్యార్థులకు బోధిస్తున్న దృశ్యం

మల్కాపురం: ఇతరులకు అర్థమయ్యేలా, చక్కటి భాషలో విషయాన్ని చెప్పడం అనేది నాయకత్వం లక్షణాల్లో అత్యంత ప్రముఖమైనదని మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి వి.అజేయ్‌కుమార్ అన్నారు. వేసవి తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఆంగ్ల భాష నైపుణ్యంపై శిక్షణ ఇచ్చారు. ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే ఉద్యోగాలు పొందడానికి, ప్రపంచం పట్ల అవగాహన పెంచుకోవడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి భాగ్యలక్ష్మి, రచయిత సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవ్

గోపాలపట్నం: పార్టీ బలోపేతానికి నాయకులంతా సమష్టిగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ సూచించారు. పశ్చిమ నియోజకవర్గ బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం మంగళవారం బుచ్చిరాజుపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు దిలీప్ వర్మ, పాలిమేర శ్రీనివాసరావు, జీసీ నాయుడు, బాల రాజేశ్వరరావు, కాళ్ల అశోక్, చల్ల మంజుల, భాను పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



గంజాయితో పట్టుబడ్డ నిందితులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఫోర్తు టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కేరళకు చెందిన శ్యామ్‌దాస్, అవినాష్.. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి విశాఖ రైల్వేస్టేషన్ పోస్టు ఆఫీస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. ఆటు వైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు వారిని పట్టుకుని విచారించగా.. 8 కిలోల గంజాయి గుర్తించారు. ఫోర్తు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు

సీతమ్మధార: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేట దరి షిర్డీసాయిబాబా ఆలయం సమీపంలోని ఒక ఇంటి మేడపై ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారంతో ద్వారకా ఎస్ఐ అప్పలరాజు, టాస్క్‌ఫోర్సు ఎస్ఐ రమణ దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి పౌడర్‌తో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

లలితా పీఠంలో సంకటహర చతుర్థి పూజలు



లలితాపీఠంలో గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు



లలితాపీఠంలో లక్ష్మీ గణపతి హోమం చేస్తున్న పండితులు

సీతంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా స్థానిక లలితా పీఠంలో మంగళవారం సాయంత్రం వినాయకుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణనాథునికి అత్యంత ప్రీతిపాత్రమైన తిథుల్లో చతుర్థి ఒకటని, కష్టాల నుంచి గట్టెక్కించే సంకట హర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. దీనిలో భాగంగా పీఠం అర్చకుల మంత్రోచ్చారణ మధ్య దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివి వినిపించారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తకంగా గణపతి హోమం చేశారు. బహుళ అష్టమిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 10 గంటలకు చండీ హోమం, సాయంత్రం 6.30 గంటలకు కాళీ కాలభైరవ హోమం నిర్వహించనున్నట్టు కృష్ణసేన్ తెలిపారు. సీతంపేట కూడలిలో దుర్గాగణపతి ఆలయం, శంకరమఠం రోడ్‌లో విజయగణపతి ఆలయంలో సంకట హర చతుర్థి పూజలు చేశారు.

వైభవంగా దుర్గమాంబ జాతర

అమ్మవారిని దర్శించుకున్న మేయర్ ఇతర ప్రముఖులు



అమ్మవారి సన్నిధిలో మేయర్ హరి వెంకటకుమారి



భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు శర్మ

కంచరపాలెం: కంచరపాలెం పరిధి దుర్గానగర్, గొల్ల కంచరపాలెం ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తొలిపూజ గ్రామ కమిటీ సభ్యులు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలతో దర్శనాలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి దంపతులు, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, కార్పొరేటర్లు రాజశేఖర్, రజిని, వాణీనానాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశికూడలి, దయానందనగర్, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. సాయంత్రం అమ్మవారి ప్రతిమలతో శ్రీరామ సేవా సమాజం వద్ద గల మూలవిరాట్ నుంచి తిరువీధి నిర్వహించారు. సుమారు 49 ఘటాలను ఆలయానికి చేర్చారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, వివిధ నేలవేషాలు, నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాత్రపల్లి వెంకటరమణ, వై.వి.రావు, వై.ఎ.రావు, ఎస్.ఎస్.కుమార్, పి.పెంటి నాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ కుదేలు



817వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న ఉక్కు కార్మిక కుటుంబాలు

కూర్మన్నపాలెం : ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీ కరిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు 817వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఆర్ఎంహెచ్‌పీ విభాగం కార్మికులు కుటుంబాలతో సహా పాల్గొన్నా రు. ప్రాణ త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదన్నారు. దళితులు, బలహీనవర్గాలు,పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతుందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు.